క్లుప్తంగా

నేడు భూముల రీ సర్వే

తాళ్లూరు: మండలంలోని రామభద్రపురంలో సోమవారం వ్యవసాయ భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానుయేల్ తెలిపారు. రైతులందరూ అందుబాటులో ఉండి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. సర్వేయర్ కొలతలు వేసే సమయంలో ప్రతి రైతు అందుబాటులో ఉండి నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు.

చెంచులకు ప్లేట్ల తయారీపై అవగాహన

- ప్లేట్ల తయారీ కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని తుమ్మల బైలు చెంచుగూడెంలో చేపట్టిన భోజనప్లేట్ల తయారీ కేంద్రాన్ని రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చెంచులకు ప్లేట్ల తయారీపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరక్టర్‌లు లావణ్య, అనురాధ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శివప్రసాద్, ఏపీఓ సురేష్ కుమార్, డీఈ రియాజ్ అహమ్మద్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు,

ఆలయాల్లో భక్తుల పూజలు



గుండంచర్లలో ప్రత్యేక అలంకారంలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ, వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామ సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయ స్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు.

రహదారుణం

- అధ్వానంగా కర్రోల-హనుమాన్‌జంక్షన్ కుంట రహదారి
- కంకర వేసి వదిలేసిన కాంట్రాక్టర్
- దుమ్ముతో వాహనదారుల అవస్థలు



చట్లమిట్ల గ్రామం సమీపంలో రోడ్డుపై దుమ్ము

పెద్దారవీడు: మండలం పరిధిలో కర్రోల గ్రామం నుంచి హనుమాన్ జంక్షన్‌కుంట రహదారిలో వెళ్తున్న వాహనాలతో దుమ్ము, ధూళి రేగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ రోడ్డుపై ప్రయాణం అంటేనే కళ్లు మూసుకోవాల్సిందేనని వాహనదారులు భయందోళన చెందుతున్నారు. వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పుడల్లా దుమ్ము, ధూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిపై శ్రీశైలం, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. జాతీయ రహదారిపై కంకర వేసి రోజులు గడుస్తున్నా తారు వేయలేదు. అలాగే కాంట్రాక్టర్ రోడ్డుపై ట్యాంకర్ల ద్వారా నీరు పెట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో వాహనాలు వెళ్లిన ప్రతి సారి భారీగా దుమ్ము లేస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కంకర్‌పై నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ముప్పు తిప్పలు పడుతున్నారు. వాహనాలు వచ్చి పోయేటప్పుడు భారీ ఎత్తున దుమ్ము లేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం గుర్తించలేనంత దట్టంగా దుమ్ము కమ్ముకుంటోంది. ముందు వెళ్తున్న వాహనంతో వెనకాల వెళ్తున్న వాహనదారులు దుమ్ము కళ్లు, ముక్కుల్లో చేరడంతో మంట, దగ్గు సమస్యలతో బాధపడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దుమ్ము లేచిన ప్రాంతాల్లో కంకర్‌పై నీటిని చల్లించి త్వరగా తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా టోర్నమెంట్ ముగింపు



బూచేపల్లి, తాటిపర్తి, హర్షిత్‌లను గజమాలతో సన్మానిస్తున్న పెద్దారవీడు మండల నాయకులు



ముగింపు సభలో పాల్గొన్న ప్రజలు

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 7 రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం వైభవంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డిలకు ఘన స్వాగతం లభించింది. వారిని పెద్దారవీడు మండలానికి చెందిన నాయకులు, క్రీడాకారులు గజమాలతో ఘనంగా సన్మానించారు. క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు బూచేపల్లి టాస్‌వేసి ఆటను ప్రారంభించారు. విన్నర్, రన్నర్, మూడవ స్థానంలో నిలిచిన టీంలతోపాటు టోర్నమెంట్‌లో పాల్గొన్న 72 టీంలలో ప్రతిభ కనపరచిన క్రీడాకారుడికి నగదు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ ప్రారంభం నుంచి ఎమ్మెల్యే తాటిపర్తి అన్ని కార్యక్రమాలపై శ్రద్ధ వహించి ఎటువంటి లోటు లేకుండా ప్రశాంతంగా టోర్నమెంటు జరిగేలా చర్యలు తీసుకున్నారు. క్రీడాకారుల మధ్య జరిగిన స్వల్ప వివాదాలను ఆయనే దగ్గర ఉండి పరిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు, వీక్షకులకు భోజన ఏర్పాట్లు కల్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. టోర్నమెంటు కోసం కావలసిన గ్రౌండ్‌కు కొంతమంది ఆటంకం పరిచినా ఆయన గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలతోపాటు స్థానిక పుల్లలచెరువు రోడ్డులో ఉన్న బృందావన గార్డెన్స్‌లో గ్రౌండ్‌లను ఏర్పాటు చేసుకొని క్రీడలు సజావుగా జరిపించారు. తనతో సహకరించిన టోర్నమెంట్ ఎంపైర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలతోపాటు గ్రౌండ్‌లో పనిచేసే బాయిస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ విభాగాల నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మూర్తిరెడ్డి, ఎం.బాలగురవయ్య, షేక్ మజీద్, కె.ఓబులరెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, యేర్వ చలమారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, సయ్యద్ షాబీర్‌బాష, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, మార్తాల సుబ్బారెడ్డి, కోట్ల సుబ్బారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, వై.రోషిరెడ్డి, దుద్యాల వెంకటరెడ్డి, రంగబాబు, అరుణాబాయి, సరళ, చెంచిరెడ్డి, కోటిరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, కె.సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

ప్రజా సేవలో పోలీసు



సింగుపల్లిలో ప్రధాన రహదారిపై ఉన్న మురుగునీరు

పుల్లలచెరువు: నిత్యం ఎంతో బిజీగా ఉండే పోలీసులు ప్రజా సేవలో కూడా ముందుంటారని నిరూపించారు పుల్లలచెరువు ఎస్ఐ సంతప్‌కుమార్. మండలంలోని సింగుపల్లి గ్రామంలో పారిశుద్యం చాలా అధ్వానంగా ఉంటుంది. ప్రధాన రహదారిపై నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతూ ఆ రహదారిపై ప్రయాణించే వారు నిత్యం చాలా ఇబ్బందులు పడుతుండేవారు. గ్రామాల్లో పర్యటిస్తున్న ఎస్ఐ సంపత్ కుమార్ ఈ గ్రామ ప్రధాన వీధిలో సమస్య పై దృష్టి సారించారు. వెంటనే అధికారులు, గ్రామస్తులతో మాట్లాడి పనులు మొదలు పెట్టారు. రహదారిపై మురుగు నీరు పోయేందుకు కాలువలు తీయించి సైడు దోనెలు వేయించి మురుగు నీరు అంతా గ్రామం బయటకు వచ్చేలా పనులు చేపట్టారు.



మురుగునీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకుంటున్న పోలీసులు

నేరాలు తగ్గించేలా చర్యలు చేపట్టాలి

- డీఎస్పీ లక్ష్మీనారాయణ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

ముండ్లమూరు(దర్శి): నేరాలు తగ్గించే విధంగా పోలీసులు చర్యలు చేపట్టాలని డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆదివారం సందర్శించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. బ్రిటిష్ కాలంలో 1901లో నిర్మించిన పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించిన అనంతరం నూతన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. కేసుల వివరాలు, దర్యాప్తు తీరుపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎస్సైలు వై.నాగరాజు, ఎం.మురళీ, మల్లికార్జునరావు, ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, హనుమంతరావు, రైటర్ బి.వెంకటేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి 'మానవత' చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

ముండ్లమూరు(దర్శి): మండలంలోని ఉల్లగల్లు గ్రామం హరిజనవాడకు చెందిన పునుగుపాటి విజయరావు అనారోగ్యంతో మృతి చెందగా.. ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న మానవత సంస్థ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రూ.5 వేలు, సంస్థ డైరెక్టర్ రెడ్డిమాసు రాఘవులు మరో రూ.5 వేలను చైర్మన్ దేవత వరప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించినందుకు విజయరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ గొర్రెపాటి వేణు, డైరెక్టర్‌లు జైహింద్‌రెడ్డి, సుశీల, భిక్షాల్‌రెడ్డి, ఎద్దు నాగేష్, గ్రామ సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలి

- మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న శిద్దా రాఘవరావు

ముండ్లమూరు(దర్శి): ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఆర్యవైశ్య నాయకుడు శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట హనుమంతరావు అధ్యక్షతన మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా అమరా శ్రీరామమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హాజరైన శిద్దా రాఘవరావు స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుండాలని సూచించారు.

టీడీపీ కార్యక్రమంలా చేయడంపై విమర్శలు

ఆర్యవైశ్య మండల కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో శిద్దా రాఘవరావుకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఆ సామాజికవర్గానికి చెందిన పలువురు మండిపడ్డారు. సొంత సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రిని కాదని ఇక్కడ పోటీ చేసి ఓడిపోయిన టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం, శిద్దా కంటే ముందే ఆహ్వానించడాన్ని పలువురు తప్పుబట్టారు. తమ సామాజిక వర్గం కాకపోయినా గొట్టిపాటి లక్ష్మి చేతులమీదుగా ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడికి నియామక పత్రం అందజేయడం వారిలో మరింత ఆగ్రహాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో గొట్టిపాటి లక్ష్మి అక్కడి నుంచి వెళ్లే వరకు శిద్దా రాఘవరావు హాజరు కాలేదు. ఇదిలా ఉండగా పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులందరితో నిర్వహిస్తున్న ప్రమాణ స్వీకారాన్ని టీడీపీ పార్టీ కార్యక్రమంలా నిర్వహించారని వైశ్య నాయకులు పెదవివిరిచారు.

ఏళ్ల తరువాత కలిసి.. ఆనందాలు విరిసి



పెద్దదోర్నాల లో 43 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెద్దదోర్నాల: వారంతా 43 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981–82వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ చదివిన వారంతా సుదీర్ఘ విరామం అనంతరం ఆదివారం మళ్లీ కలుసుకునే అపురూప అవకాశం వారికి కలిగింది. స్థానిక లహరి ఫంక్షన్ హాల్ అందుకు వేదికైంది. దీంతో వారంతా చిన్నపిల్లలా కేరింతలు కొట్టారు. స్నేహితుల క్షేమ సమాచారాలను ఒకరినొకరు తెలుసుకున్నారు. పిల్లల చదువులు, వారి ఉద్యోగ విషయాలను పంచుకున్నారు. చదువు చెప్పిన అలనాటి గురువులను సత్కరించుకున్నారు. వారికి నూతన వస్త్రాలు ఇచ్చారు. చిన్నపాటి మ్యూజికల్ ప్రోగ్రాం ఏర్పాటు చేసుకుని తమ సహచరులతో సినిమా పాటలకు నృత్యాలు చేశారు. విందులో పాల్గొని, ఫొటో షూట్‌లలో ఆనందంగా గడిపారు. అనంతరం తమ సహచరుడు ఈదర ఆంజనేయులు రచించిన భక్తాంజనేయస్వామి శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉపాధ్యాయుడు ముత్తారెడ్డి వెంగళరెడ్డి, కనిగిరి రామిరెడ్డి, పట్నం సుబ్రహ్మణ్యం, పటాన్ అమానుల్లాఖాన్‌లు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, తమ పూర్వ విద్యార్థులు అందించిన గౌరవ మర్యాదలు జీవితాంతం మరిచిపోలేమన్నారు. కార్యక్రమానికి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగమూర్తి పర్యవేక్షణ సహకారం అందించగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వన్నెంపల్లి మహాలక్ష్మీ అధ్యక్షత వహించారు. నాటి విద్యార్థులు రావిక్రింది సత్యనారాయణ, గ్రంధే సుదర్శనం, ఆర్‌వీ సుబ్రహ్మణ్యం, కాశింసాహెబ్, ఈదర ఆంజనేయులు, బొడ్డోజు శ్రీనివాసాచారి, బాల పిచ్చయ్య, సత్యనారాయణ, గాదె బ్రహ్మారెడ్డి, శంకర్‌నాయక్, బాలాజీ నాయక్ చిట్యాల పద్మావతి, రమాదేవి,అరుణకుమారి, చెన్నయ్య, నీరుటి కాశయ్య పాల్గొన్నారు.



దొనకొండలో అమిత్ షా రాజీనామా చేయాలంటూ నినాదాలిస్తున్న సీపీఎం నాయకులు



ఉల్లగల్లులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అమిత్ షా గో బ్యాక్

దర్శి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై ఇష్టారీతిగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం, సీపీఐ దర్శి నియోజకవర్గ నాయకులు మాడపాకుల రమేష్, తాండవ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గో బ్యాక్ అమిత్‌షా అంటూ నినాదాలు చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరూ అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకించాలని కోరారు. బీజేపీ అనుసరిస్తున్న మత ఉన్మాదమే దీనికి కారణమని అన్నారు. దేశ లౌకిక రాజ్యాంగం బీజేపీకి కంటగింపుగా ఉందని అందుకే ఆ పార్టీ నాయకులు బరితెగించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎప్పటి నుండో ప్రయత్నిస్తున్నాయని, దేశ లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిన నేపథ్యంలో మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు రాచపూడి కరుణానిధి, కేవీ పిచ్చయ్య, కల్లూరి ఆంజనేయులు, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, ఇత్తడి సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ఉల్లగల్లులో సీపీఎం నేతల నిరసన

ముండ్లమూరు(దర్శి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై నోరు పారేసుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన పదవికి అనర్హుడని సీపీఎం ముండ్లమూరు మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు విమర్శించారు. అమిత్‌షా విజయవాడ రాకను నిరసిస్తూ మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో వామపక్షాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. గోబ్యాక్ అమిత్‌షా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు, బొమ్మతోటి రాజారమేష్, పొట్లూరి సుబ్బారావు, నన్నం ఆంజనేయులు, గోపనబోయిన హనుమంతరావు, తిరుపతిరావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

దొనకొండ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ నుంచి 4 రోడ్ల కూడలిలో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసే చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుందుర్తి చిన్న నరసింహులు, కోలా కిరణ్‌కుమార్, మాలపోలు అంజి, సంతోష్‌కుమార్, పి.కాశయ్య, ఉదయ్‌కుమార్, జె.ప్రసాద్, వై.నాథన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ లో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్



స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

పుల్లలచెరువు: పుల్లలచెరువు పోలీసుస్టేషన్‌లో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా చేసి అనంతరం మొక్కలు నాటారు.